సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 24 । జూలై । 2024



సోమశిలలో 9.695 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 9.695 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 5 క్యూసెక్కుల విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.71,870
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,440
3శాతం జీఎస్టీతో	రూ.6,633
సవర (8గ్రా)	రూ.53,064

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.0 /29.0

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. వాతావరణంలో తేమ 56 శాతం ఉంది.

న్యూస్‌రీల్

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో రెండు యూనిట్ల నుంచి మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు మంగళవారం తెలిపారు. ఇందులో భాగంగా 1వ యూనిట్లో 420 మెగావాట్లు, 2వ యూనిట్లో 430 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. ఓవరాలింగ్ కారణంగా 3వ యూనిట్లో విద్యుదుత్పత్తి నిలిపివేసినట్లు పేర్కొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విడవలూరు: స్థానిక పీఆర్ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి రెండు అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ బి.సుజాత మంగళవారం తెలిపారు. కామర్స్ సబ్జెక్ట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి 55 శాతం మార్కులతో నెట్, ఎస్‌ఈపీ, పీహెచ్‌డీ పాసై, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని ఆమె తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు కళాశాలలో దరఖాస్తు అందజేయాలన్నారు. వివరాలకు కామర్స్ అధ్యాపకుడు ఎస్‌సీ శ్రీనివాసులును 8121968382 నంబరులో సంప్రదించాలని కోరారు.

వీఎస్‌యూలో డిగ్రీ కోర్సులు ప్రారంభం

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో 2024–25 విద్యా సంవత్సరం నుంచి 4 యూజీ డిగ్రీ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ హానర్స్ ఫిజిక్స్‌లో 50 సీట్లు, బీకాం హానర్స్ కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 60 సీట్లు, బీబీఏ లాజిస్టిక్స్‌లో 60 సీట్లు, బీఎస్సీ హానర్స్ స్టాటిస్టిక్స్‌లో 50 సీట్లు ఉన్నాయని వివరించారు. అడ్మిషన్ల కోసం ఓఏఎండీసీ పోర్టల్, యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఉపాధికి పచ్చ గ్రహణం



పనుల్లేక కూలీల ఆకలి కేకలు

- 80 శాతం పంచాయతీల్లో పనులు నిలుపుదల
- పనులు చేయొద్దంటూ అధికారులకు టీడీపీ నేతల హుకుం
- మే నెలలో జిల్లాలో 16.82 లక్షల పనిదినాలు
- జూన్‌లో కేవలం 6.86 లక్షలు మాత్రమే
- రోజుకు 9 నుంచి 10 వేల మంది హాజరు
- ఫీల్డ్ అసిస్టెంట్లను మార్చేందుకు కుట్రలు

ఉపాధి పనులకు పచ్చ గ్రహణం పట్టింది. టీడీపీ నేతలు తమ స్వప్రయోజనాల కోసం కూలీల కడుపులు కొడుతున్నారు. ఈ పథకం ద్వారా జేబులు నింపుకునేందుకు తెలుగు తమ్ముళ్లు వెంపర్లాడుతున్నారు. ఆ శాఖపై పెత్తనం చెలాయించి 'ఉపాధి' పొందేందుకు నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. అసలే తీవ్ర వర్షాభావంతో ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయం కూడా లేకుండా పోయింది. ఈ దశలో దినసరి కూలీలను ఆదుకునే ఉపాధి పథకాన్ని తమకు ఆదాయ వనరుగా మార్చుకునేందుకు క్షేత్ర స్థాయిలో సిబ్బంది నియామకం నుంచి పనుల నిర్ధారణ వరకు తమ కనుసన్నల్లో నిర్వహించుకునే విధంగా జిల్లాలో ఎక్కడికక్కడ పనులు మౌఖిక ఆదేశాలతో నిలిపేశారు. ఉపాధి హామీ పథకంలో క్షేత్ర స్థాయిలో కీలకంగా ఉండే 'ఫీల్డ్ అసిస్టెంట్' పోస్టింగ్‌ల కోసం సంబంధిత ఉద్యోగులు నాయకుల చుట్టూ తిరుగుతుండడం విశేషం.



కలిగిరి మండలం ఏపినాపిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

➡ ఉదయగిరి మండలంలో 17 పంచాయతీలు ఉన్నాయి. అందులో గన్నేపల్లి, కృష్ణంపల్లి, నేలటూరు పంచాయతీల్లో మాత్రమే స్థానిక టీడీపీ నేతలతో ఫీల్డ్ అసిస్టెంట్ల మధ్య ఒప్పందం జరగడంతో అక్కడ మాత్రమే ఉపాధి పనులు జరుగుతున్నాయి. మిగిలిన పంచాయతీల్లో నలభై ఐదు రోజులుగా పనులు నిలిపివేశారు. తాజాగా ఉదయగిరి, దాసరిపల్లి, జీసీపల్లి పంచాయతీల్లో టీడీపీ నేతలు చెప్పిన వారినే అనధికారికంగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియామకం చేసుకుని పనులు ప్రారంభించారు. మిగిలిన చోట్ల పనులు నిలిపివేయడంతో పాటు అక్కడ పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలు కూడా ఇవ్వక పోగా రాజీనామా చేయాలని స్థానిక ఎంపీడీఓ ద్వారా ఒత్తిడి తెస్తున్నారు.

➡ ఆత్మకూరు నియోజకవర్గం అనంతసాగరం మండలంలోని వెంగంపల్లిలో స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్‌పై అధికార పార్టీకి చెందిన ఓ చోటా నేత వెంటనే రాజీనామా చేయాలని ఒత్తిడి తేవడంతో పాటు బెదిరింపులకు దిగిన ఆడియో ఇటీవల వైరల్‌గా మారింది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ అధికారంలోకి రావడంతోనే ఆ పార్టీ నేతలు ఆదాయ వనరుల కోసం వేట ప్రారంభించారు. 2014–19 మధ్య కాలంలోనూ ఉపాధి హామీ పథకం తెలుగు తమ్ముళ్లు కామధేనువుగా మారింది. ఈ పథకం ద్వారా చేసిన పనులకు సోషల్ ఆడిట్ తప్ప రికార్డులు చూపించాల్సిన అవసరం లేకపోవడంతో అడ్డంగా దోచుకునేందుకు తమ్ముళ్లు వెంపర్లాడుతున్నారు. గతంలోనూ ఆధారాల్లేకుండా అడ్డంగా దోచుకున్న ఈ పథకంపై తమ్ముళ్ల దృష్టి పడింది. దోచుకునేందుకు తమకు అనుకూలమైన వారిని నియమించుకునే వరకు, తమకు ఉపయోగపడే పనులు కల్పించుకునేందుకు ఎక్కడా ఉపాధి పనులు చేయొద్దని సంబంధిత అధికారులను మౌఖికంగా ఆదేశించడంతో అనధికారికంగా పనులు ఆపేశారు. ఫలితంగా పనులు లభించక కూలీలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

తమకు అనుకూలంగా పనిచేస్తే సరి..

ఉపాధి హామీ పనులు పర్యవేక్షణకు, కూలీలకు పనులు కల్పించేందుకు మండల స్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్, టీఏ, బీఎఫ్‌టీ, ఈసీ, ఏపీఓ వంటి సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. ప్రతి వారం పనులను గుర్తించి అనుమతి తీసుకుని కూలీలకు పనులు కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్‌ది కీలక భూమిక. దీంతో టీడీపీ నాయకులు కళ్లు ఇప్పుడు ఉపాధి పనులపై పడ్డాయి. ఇప్పటికే పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి టీడీపీ నాయకులు చెప్పిన వారిని నియమించాలంటూ కుతంత్రాలు చేస్తున్నారు. మండల స్థాయి అధికారులు, ఉద్యోగులపై ఒత్తిళ్లు చేస్తున్నారు. అనేక గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను నేరుగా బెదిరిస్తున్నారు.

గత నెల నుంచి పనుల్లేవ్

మే నెలలో జిల్లా వ్యాప్తంగా 16,82,868 పని దినాలు కల్పిస్తే.. టీడీపీ అధికారంలోకి వచ్చిన జూన్ నెలలో 6,86,370 పని దినాలు మాత్రమే కల్పించారు. మే నెలలో రోజుకు 60 వేల నుంచి 70 వేల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరైతే.. ప్రస్తుతం రోజుకు 9 వేల నుంచి 10 వేల మంది కూలీలు హాజరవుతున్నారు. ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, సర్వేపల్లి తదితర నియోజకవర్గాల్లో 80 శాతం పనులు పూర్తి స్థాయిలో నిలిచిపోయాయి. జిల్లా వ్యాప్తంగా 721 పంచాయతీలు ఉంటే.. 371 పంచాయతీల్లో మాత్రమే ఉపాధి పనులు జరుగుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. టీడీపీ నేతలు 2014–19 మధ్య ఉపాధి పనుల్లో అడ్డగోలుగా దోచుకుతిన్నారు. చెక్‌డ్యామ్‌లు, పంట కుంటలు తదితర పేర్లతో ఉపాధి నిధులను స్వాహా చేశారు. టీడీపీకి అనుకూలంగా ఉన్న మండల స్థాయి సిబ్బంది ఒకరు రూ.2 కోట్ల మేర పనులు చేయకుండా చేసినట్లు నగదు స్వాహా చేసి ఉద్యోగం వదిలేసి వెళ్లిపోయాడు. గతంలో యంత్రాలతో పనులు చేసి కూలీల కడుపు కొట్టారు. ఐదేళ్ల తర్వాత తిరిగి అధికారం రావడంతో వారికి అనుకూలంగా పనులు చేసే వారి కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను వెళ్లిపొమ్మని లేకుంటే ఏదో ఒక కేసు పెట్టి సాగనంపుతామంటూ బెదిరిస్తున్నారు.

పనులు ఎక్కడా ఆపలేదు

మేజర్ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. ఎక్కడా పనులు ఆపలేదు. ఈ మధ్య కాలంలో వర్షాల వల్ల పనులకు వచ్చే కూలీల సంఖ్య తగ్గింది. కూలీల సంఖ్య పెంచేలా చర్యలు చేపట్టాం. అన్ని పంచాయతీల్లో పనులు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసులు, డ్వామా పీడీ

కూలీల ఆకలి కేకలు

జిల్లాలో 37 మండలాల్లో 3.32 లక్షల జాబ్‌కార్డులు కలిగిన కూలీలు ఉన్నారు. గత ప్రభుత్వ కాలంలో ప్రతి నెల 1.4 లక్షల కుటుంబాలకు ఉపాధి పనులు కల్పించారు. ఈ ఏడాది మార్చి నుంచి జూన్ 24వ తేదీ వరకు పనులు చేసిన కూలీలకు రూ.92.22 కోట్ల మేర వేతనం రూపంలో చెల్లించారు. మనుబోలు, వెంకటాచలం, బోగోలు, కావలి, ఉదయగిరి, ఎస్ఆర్‌పురం, ఆత్మకూరు, రాపూరు తదితర మండలాల్లో టీడీపీ నాయకుల ఒత్తిళ్లు అధికంగా ఉన్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్లను మానసికంగా వేధిస్తున్నారు. ఉదయం 6 గంటలకు ఉపాధి పనులకు వెళితే 11 గంటలకు తిరిగి వస్తారు. భోజనం చేసి వ్యవసాయ పనులకు వెళుతున్నారు. అధిక శాతం మంది రోజుకు రెండు పనులు చేసుకుంటూ సంతోషంగా జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం తీవ్ర వర్షాభవంతో జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయం కూడా లేకుండా పోయింది. దీంతో అటు వ్యవసాయ పనులు, ఇటు ఉపాధి పనులు లేక కూలీలు ఆకలి కేకలు పెడుతున్నారు.

సింహపురి.. సారీ



కేంద్ర విత్త మంత్రి.. సింహపురికి ఉత్త చేతులూపారు. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం ప్రాజెక్ట్‌ల భవిష్యత్ ఊసెత్తకుండానే నిర్మలమ్మ పొద్దు వెల్లడించారు. విశాఖ– చెన్నై కారిడార్ నోడ్‌లను ప్రస్తావించినా.. నిర్దిష్టత లేకపోవడంతో నిరాశగానే చెప్పొచ్చు. 2024–25 కేంద్ర బడ్జెట్‌లో సింహపురి అభివృద్ధికి మొండిచేయి చూపించారు. కేంద్ర ప్రభుత్వంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం కీలకంగా ఉండడంతో తప్పక పెండింగ్ ప్రాజెక్ట్‌లకు మోక్షం లభిస్తుందని ఆశించిన వారికి భంగపాటు తప్పలేదు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించినా నెల్లూరు జిల్లాకు మాట మాత్రం హామీ ఇవ్వలేదు.

- బడ్జెట్‌లో ఊసెత్తని నడికుడి–శ్రీకాళహస్తి రైల్వేలైన్
- మోక్షం లేని ఎన్పీఈఆర్సీకే
- తెలుగు అధ్యయన కేంద్రానికి మొండిచేయి
- ఊసెత్తని దగదర్తి విమానాశ్రయం, బిట్రగుంటలో రైల్వేప్రగతి
- కొంత ఊరటనిచ్చిన విశాఖ–చెన్నై కారిడార్ నోడ్‌లకు సాయం



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సువిశాలమైన సాగర తీరం వెంబడి ఏర్పాటవుతున్న పోర్టులు, రైల్, రోడ్డు, సీ కనెక్టివిటీ, అన్నింటికి మించి భూ సంపద, జల, మానవశక్తి వెరసి ఎన్నో రంగాల్లో అభివృద్ధికి అవకాశాలు పుష్కలంగా ఉన్న జిల్లా సింహపురి. ఇప్పటికే ఎన్నో భారీ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలు ఉన్న జిల్లా పారిశ్రామిక రంగానికి అక్షయ పాత్రలాంటిది. ప్రభుత్వ ప్రోత్సాహంతో వీటిని సద్వినియోగించుకుంటే జిల్లా పారిశ్రామికంగా స్వర్గధామం అవుతుందనడంలో సందేహం లేదు. చారిత్రాత్మక ప్రసిద్ధి చెందిన సింహపురి పాలకులు కేంద్ర పెండింగ్ ప్రాజెక్ట్‌లకు నిధులు రాబట్టడంలో విఫలమయ్యారనే చెప్పవచ్చు.

దశాబ్దంన్నర కాలంగా మెట్ట ప్రాంత వాసులకు నడికుడి– శ్రీకాళహస్తి రైల్వే మార్గం ఊరిస్తూనే ఉంది. ఈ ప్రాజెక్ట్ ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా ఇంకా పూర్తి కాలేదు. ఇందుకు కారణం ఆశించిన నిధులు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడమే. ప్రస్తుత బడ్జెట్‌లో కూడా నడికుడి రైల్వేలైన్‌కు నిధులు కేటాయింపులు చేస్తారేమోనని ఆశించిన మెట్ట ప్రాంత వాసులకు నిరాశ కలిగించింది. వెంకటాచలం మండలంలోని ఏర్పాటు చేసిన ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి నిధులు కేటాయింపులు జరగలేదు. గత రెండేళ్ల క్రితమే భవన నిర్మాణానికి భూములు కేటాయింపులు చేసినా నిధులు లేకపోవడంతో భవన నిర్మాణం కూడా పూర్తి చేయలేదు. ఈ సారైనా బడ్జెట్‌లో కేటాయింపులు వస్తాయనకుంటే నిరాశే మిగిలింది. భారతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటుకు కూడా ఈ పద్దులో నిధులు కేటాయింపులు జరగకపోవడం ఆశాభంగమే. ఎనిమిదేళ్ల కిందట శంకుస్థాపన చేసినా నిధులు లేక నిలిచిపోయింది. దగదర్తి విమానాశ్రయం, బిట్రగుంటలోని రైల్వే ప్రాజెక్ట్‌ల ఊసే లేకపోవడంతో మరోసారి.. సింహపురికి.. సారీ చెప్పింది. కేంద్రంలో కూటమి ప్రభుత్వం కీలకంగా ఉన్న సమయంలో కూడా పెండింగ్ ప్రాజెక్ట్‌లకు నిధులు సాధించుకోలేకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కారిడార్ నోడ్‌లకు ప్రత్యేక సాయం ఊరట

ఈ బడ్జెట్‌లో విశాఖ– చెన్నై కోస్టల్ కారిడార్‌లోని పారిశ్రామిక నోడ్‌లకు ప్రత్యేక సాయం ఉంటుందని బడ్జెట్‌లో చెప్పడం ఉమ్మడి జిల్లా వాసులకు కొంత ఊరట నిచ్చిందని చెప్పాలి. ఈ కారిడార్‌లో భాగంగా కృష్ణపట్నం వద్ద 11,095 ఎకరాల్లో రూ.5,783.84 కోట్లతో క్రిస్ సిటీ ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం అన్ని అనుమతులు సిద్ధం చేసింది. కృష్ణపట్నం ఇండస్ట్రియల్ సిటీ డెవలప్‌మెంట్ లిమిటెడ్ పేరుతో టెక్స్‌టైల్స్, ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంజినీరింగ్, ఎంఎస్ఎంఈ రంగాల పరిశ్రమలను ఇందులో ఏర్పాటు చేసేలా ప్రణాళిక సిద్ధమైంది. ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌లో నోడ్‌లకు ప్రత్యేక సాయం చేస్తామని చెప్పడంతో ఈ ప్రాజెక్టు పురోగతిలోకి రానుంది. అయితే ఎంత కేటాయిస్తారు.. ఎప్పటిలోగా ఈ ప్రణాళిక పూర్తవుతుందనే నిర్దిష్ట గడువు లేకపోవడంతో అనుమానాలకు తావిస్తోంది. ఈ ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో అందుబాటులో వస్తే 2.96 లక్షల మందికి ప్రత్యక్షంగా, 1.71 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి దక్కనుంది.

ఉద్యోగులకు పెద్దగా ఉపయోగం లేదు



ఉద్యోగులకు పెద్దగా ఉపయోగం లేదు. స్టాండర్డ్ డిడక్షన్ రూ.50 వేలు నుంచి రూ.75 వేలకు పెంపు ద్వారా ప్రయోజనం ఉండదు. రూ.3 లక్షల వరకు పన్ను మినహాయింపు కూడా ఉద్యోగులకు కొంత ఊరట మాత్రమే. పన్ను మినహాయింపును పెంచాలి.

– చేజర్ల సుధాకర్‌రావు, ఏపీ హెల్త్‌అడ్మినిస్ట్రేటివ్, మెడికల్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

వ్యక్తిగత పన్నులకు మినహాయింపుల్లేవ్



వ్యక్తిగత పన్నులకు పెద్దగా మినహాయింపులు లేవు. అయితే పన్నుల విధి, విధానాలపై సమీక్షించి ఆదాయపు పన్ను చట్టానికి కొత్త రూపు తెస్తామని ప్రకటించడం సంతోషకరం. ఉపాధి, ఉద్యోగాలకు పెద్ద పీట వేసే విధంగా చర్యలు చేపట్టారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్కీమ్ పొందని విద్యార్థులకు విద్యా రుణాలపై 3 శాతం వడ్డీ రాయితీ కల్పించారు.

– చిన్ని శ్రావణ్‌కుమార్, చార్టెడ్ అకౌంటెంట్

ఉపాధి రంగానికి నిధుల్లేవ్



ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంచకపోవడం విచారకరం. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్య పెరుగుతుంది. స్త్రీ,శిశు సంక్షేమానికి కూడా నిధులు పెంచలేదు. అంగన్‌వాడీల్లో పిల్లలకు పౌష్టికాహారం కొరత ఏర్పడే ప్రమాదం ఉంది.

– గోగుల శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

రైల్వేలైన్‌కు నిధులేవి



నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే లైన్‌కు నిధులు మంజూరు చేయకపోవడం దారుణం. ఎన్నో ఏళ్లుగా మెట్ట ప్రాంతాలను కలిపేలా నిర్మించాలని గతంలో తలపెట్టిన ఈ రైల్వేలైన్ నిర్మాణంపై కేంద్రం దృష్టి సారించకపోవడం బాధాకరం. రైల్వేలైన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా భూసేకరణ జరిగినా నిధులు మంజూరు కాకపోవడంతో పనులు జరగడంలేదు. మొదటి విడతగా దాదాపు 73 కి.మీ. రైల్వే లైన్ స్టేషన్ల నిర్మాణం పూర్తయిందన్నారు.

– బాలానాయుడు, తరుణవాయి, సంగం

పాత పన్ను విధానంలో మార్పు చేసి ఉంటే మేలు చేకూరేది



పాత ఆదాయ పన్నుల స్లాబులు మార్చకపోవడం సామాన్య వేతన జీవులకు తీవ్ర నిరాశ కలిగించింది. పెరిగిన ధరలు, ప్రస్తుత ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని పాత పన్ను విధానంలో మార్పులు చేసి ఉంటే మధ్య తరగతి, సామాన్య వేతన జీవులకు మేలు చేకూరేది. సేవింగ్స్ పరిమితిని రూ.2.50 లక్షలకు, పన్ను మినహాయింపు రూ. 8 లక్షల వరకు పెంచి ఉంటే బాగుండేది.

– అల్లంపాటి సురేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఏపీటీఎఫ్

సొంత జిల్లాలకు తహసీల్దార్ల బదిలీ

నెల్లూరు (దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు బదిలీ అయిన 34 మందితహసీల్దార్లను సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ కలెక్టర్ ఓ ఆనంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్లు షేక్ ఇస్మాయిల్, ఎం.పూర్ణచంద్రావు, బి.వెంకటస్వామి, కె.రవిబాబు, డి.పద్మనాభుడు, జి ప్రసాద్‌రావులను గుంటూరు జిల్లాకు, ఏవీపీ చంద్రారెడ్డి, ఎస్.శివనాగిరెడ్డి, ఎన్.దుర్గేశ్వరరావు, జీ.విజయసాయి, ఎంకే శ్యామారాణి, కె.నాగేష్, ఏవీ రమణ, ఎన్.నాగమల్లీశ్వరరావు, జీ రమేష్‌కుమార్ పల్నాడు జిల్లాకు, పీ జాన్ పీటర్, పీ నరసింహారావు, కె.గోపీకృష్ణ, పీ సీతారత్నం, జీ సాయిచరణ్, బి.వెంకటేశ్వర్లు, కె.రవికుమార్, ఎస్.వెంకటరమణ, జీవీ సుబ్బారెడ్డి, కె.నెహ్రూబాబు, పీ సురేష్‌బాబును బాపట్ల జిల్లాకు, ఎం.రాజ్యలక్ష్మి, కె.చిరంజీవి, కె.సంజీవరావు, ఎస్.వాసు, పీ శైలేంద్రకుమార్, బీ రమాదేవి, ఎంవీ కృష్ణారెడ్డి ప్రకాశం జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బదిలీ అయిన తహసీల్దార్లు తమ బాధ్యతలను డిప్యూటీ తహసీల్దార్లకు లేదా రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించి రిలీవ్ కావాలని ఆదేశించారు.

ఇసుక స్టాక్ పాయింట్లలో సీసీ కెమెరాలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

• కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): 'ఇసుక స్టాక్ పాయింట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. పంపిణీ, నిల్వల గురించి ఎప్పటికప్పుడు నివేదించేందుకు అవసరమైన అదనపు సిబ్బందిని నియమించుకోవాలి' అని కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదేశించారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో 3వ జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. నూతన ఇసుక విధానం గురించి మైనింగ్ ఉపసంచాలకుడు శ్రీనివాసకుమార్ కమిటీ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ ఇసుక సక్రమ పంపిణీ జరిగేందుకు, అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పల్లిపాడు స్టాక్ పాయింట్‌లో ఇసుక పంపిణీ పూర్తయిందని, మర్రిపాడలో 1,03,561 మెట్రిక్ టన్నులు, మినగల్లులో 17,743 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉన్నదన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్, ఇరిగేషన్ ఎస్‌ఈ కృష్ణమోహన్, ఆర్డీఓలు మలోల, మధులత తదితరులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ పథకానికి 68,546 దరఖాస్తులు

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద లబ్ధిదారుల ఎంపికకు సచివాలయం సిబ్బంది ద్వారా పరిశీలన ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఒ.ఆనంద్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పీఎం విశ్వకర్మ పథకం జిల్లా అమలు కమిటీ సమావేశం నిర్వహించారు. డీఐసీ జనరల్ మేనేజర్ సుధాకర్ పథకం లక్ష్యాన్ని వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వివిధ రకాల వృత్తి కళాకారులకు సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకు 68,546 దరఖాస్తులు వచ్చాయని, వీటిని మూడు దశల్లో పరిశీలన చేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం ప్రత్యేక చెక్‌లిస్ట్ తయారు చేసుకుని అందుకు అనుగుణంగా పరిశీలించాలన్నారు. ఈ పథకం నిబంధనల మేరకు కళాకారులు వారి వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుని, తమ కుటుంబాలను పోషించుకునే విధంగా తయారు కావాలన్నారు. గురుశిష్య పరంపరను కొనసాగించే విధంగా వృత్తి నైపుణ్యాలను ప్రభుత్వం అందిస్తున్న సహాయంతో తర్వాతి తరాలకు అందించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ శర్మద, ఎల్‌డీఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హలో.. కాస్త ఎండన ఉండండి

- ఆరోగ్యానికి విటమిన్ డి తప్పనిసరి
- లేకపోతే శారీరక, మానసిక సమస్యలు
- 60 శాతానికి పైగా ప్రజలకు లోపం
- వైద్యపరీక్షల్లో వెలుగు చూస్తున్న వైనం
- కాసేపు ఎండలో ఉంటే ఎంతోమేలు

నెల్లూరు(అర్బన్): మనిషి శరీరానికి అన్ని రకాల విటమిన్లు ఎంతో అవసరం. ఏది తగ్గినా అనారోగ్య సమస్యలు వస్తాయి. మొత్తం శరీర ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో విటమిన్ డి కీలక పాత్ర పోషిస్తుంది. ఎండ ద్వారా, కొన్ని ఆహార పదార్థాల ద్వారా ఉచితంగా లభించే విటమిన్ డి లోపిస్తే అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తాయి. చిన్న వయస్సులోనే ఎముకలు పెళుసుబారుతాయి. పిల్లల్లో రికెట్స్ వ్యాధి సోకి దొడ్డికాళ్లు ఏర్పడే ప్రమాదం ఉంది. పెద్దలు త్వరితగతిన ఆస్టియోపొరోసిస్‌కు గురవుతారు. కాల్షియం శరీరానికి అందాలంటే విటమిన్ డి చాలా కీలకం. ఇది తక్కువైతే గుండె జబ్బులు, కేన్సర్ వ్యాధులు బారిన పడే ప్రమాదం ఉంది. అందువల్ల ఉదయాన్నే కాసేపు ఎండలో ఉంటే ఎంతో ప్రయోజనం ఉంటుందని డాక్టర్లు పేర్కొంటున్నారు.

ఎందుకంటే..

విటమిన్ డి ఎముకల జీవక్రియకు అవసరమైన హార్మోన్ ఉత్పత్తికి, కండరాలు ఆరోగ్యంగా, ఎముకలు బలంగా ఉండేందుకు ఎంతో అవసరం. శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. బాడీలోని కణజాలాలను బలోపేతం చేయడానికి సహకరిస్తుంది.



జీవన విధానమే కారణం

కాలక్రమేణా జీవన విధానంలో అనేక మార్పులు వచ్చాయి. గతంలో ఉదయం వేళల్లో తప్పనిసరిగా ఎండలో ఉండేవారు. అయితే ప్రస్తుత సాంకేతిక యుగంలో ఆ పరిస్థితి లేకుండా పోయింది. ఎండలో ఉండడం, పనిచేయడం తక్కువైంది. నగరాలు, పట్టణాల్లో ఉద్యోగులు ఏసీల కింద పని చేస్తున్నారు. లేదా సూర్యకిరణాలు సోకని కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. రాత్రి 12 గంటల తర్వాత లేటుగా నిద్రపోవడం, ఉదయం 8, 9 గంటల తర్వాత లేవడం ప్రస్తుతం సర్వసాధారణమై పోయింది. ఒకప్పుడు తెల్లవారాక నిద్రలేచి ఇంటి పనులు చేసుకునే వారు. ఆ సమయంలో సూర్యరశ్మి శరీరాన్ని తాకేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కొంచెం కూడా ఎండ వేడిమిని భరించలేకపోతున్నారు. ఏసీలు, కూలర్ల మధ్య జీవితాన్ని కొనసాగిస్తున్నారు. ఆఫీసుల్లో ఉద్యోగులు ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నీడ పట్టున విధులు నిర్వరిస్తున్నారు. ఈ విధానమే వారికి అనారోగ్య సమస్యగా మారుతోంది.

పిల్లలకు సైతం కావాల్సిందే..

పసిబిడ్డలకు సైతం విటమిన్ డి తగినంత కావాలి. డాక్టర్లు సైతం పిల్లలను ఉదయాన్నే కాసేపు ఎండలో ఉంచమని చెబుతారు. ఇలా చేయడం వల్ల వారికి విటమిన్ డి లభిస్తుంది. అలాగే పిల్లలు ఎండలో కొంతసేపు ఆడుకుంటే మంచిది. దీని వల్ల వారు ఆరోగ్యంగా ఉంటారు. అయితే నేడు తల్లిదండ్రులు తమ బిడ్డలు ఎక్కడ నల్లబడిపోతారని, కందిపోతారని ఎండ తగలకుండా పెంచుతున్నారు. ఇంట్లో, పాఠశాలల్లో చదువు పేరుతో గదుల్లోనే ఉంచుతున్నారు.

తగ్గితే ఏమవుతుంది?

విటమిన్ డి తగ్గితే పలు అనారోగ్య సమస్యలు వస్తాయి. మానసిక సమతుల్యత దెబ్బతిని డిప్రెషన్‌కు గురవుతారు. కాల్షియం శరీరానికి అందాలంటే విటమిన్ డి పాత్ర కీలకం. లేకపోతే ఎముకలు గుల్లబారుతాయి. ఇన్సులిన్ కణజాలాలకు సక్రమంగా అందదు. ఫలితంగా షుగర్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. మహిళల్లో మెనోపాజ్ దశ తర్వాత సహజంగా కాల్షియం మోతాదు తగ్గుతుంది. దీంతో కేన్సర్ లాంటి జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది. మెదడులో చురుకుదనం లోపిస్తుంది. నీరసంగా ఉంటారు. జుట్టు రాలిపోతుంది. ఎముకలు మెత్తబడిపోతాయి. ఫలితంగా ఎముకలు త్వరగా విరిగే ప్రమాదం ఉంది. వ్యాధినిరోధక శక్తి తగ్గుతుంది.

చాలామందిలో లోపం

బాగా ఎండలో పనులు నిర్వహించే పల్లెవాసులు, ఇతర కార్మికులు మినహాయిస్తే జిల్లాలో మిగిలిన 60 శాతానికి పైగా ప్రజలు విటమిన్ డి లోపంతో బాధపడుతున్నట్లు వైద్య అధికారుల అంచనా. ఈ లెక్కన జిల్లాలో సుమారు 15 లక్షల మందికి విటమిన్ డి తక్కువగా ఉన్నట్లు సమాచారం. ఎక్కువ మంది ప్రజలు నీరసం, కీళ్లు, ఎముకల నొప్పులు, ఇతర సమస్యలకు గురవుతున్నారని డాక్టర్లు పేర్కొంటున్నారు.



ఎంతో అవసరం



శరీరానికి విటమిన్ డి ఎంతో అవసరం. ఇది లోపిస్తే కండరాల, ఎముకలు బలహీనపడుతాయి. ప్రతి ఒక్కరూ వ్యాధి నిరోధకశక్తిని పెంచుకునేందుకు విటమిన్ డి అవసరం. ఇది సహజంగా సూర్యరశ్మి ద్వారా లభిస్తుంది. ఎండలో కొద్దిసేపు గడపడంతోపాటు వైద్యుల సూచనలు పాటిస్తే డి విటమిన్ లోపాన్ని అధిగమించవచ్చు. ఇటీవల కాలంలో ఈ లోపం ఉన్న వారిని ఎక్కువగా చూస్తున్నాం. డి విటమిన్ ఉండే ఆహార పదార్థాలు కూడా తీసుకోవాలి.

– ప్రొఫెసర్ మస్తాన్‌బాషా, ఆర్థోపెడిక్ విభాగం, జీజీహెచ్

విటమిన్ డి ఉండే ఆహారాన్ని తీసుకోవాలి



చేపలు, లివర్, కోడి గుడ్లు, పాలు, పన్నీరు, నెయ్యి, వెన్న, పుట్టగొడుగుల్లో విటమిన్ డి పుష్కలంగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఆహారంలో ఈ పదార్థాలను తప్పక చేర్చుకోవాలి. తరచూ వీటిని తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. ఆహారం కంటే ముఖ్యంగా పైసా ఖర్చులేకుండా ఉదయం ఎండలో కాసేపు గడిపితే విటమిన్ డి పుష్కలంగా ఉంటుంది.

– కె.నాగరాజు, డైటీషియన్, మెడికవర్ స్పెషాలిటీ ఆస్పత్రి

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.65
సన్నవి	రూ.50
పండ్లు	రూ.35

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	133
లేయర్ (లైవ్)	105
బ్రాయిలర్ చికెన్	236
బ్రాయిలర్ స్కిన్‌లెస్	264
లేయర్ చికెన్	178

మా హక్కులకు భంగం కలిగించొద్దు

- అధికారులను కోరిన మత్స్యకారులు
- కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌పై ప్రజాభిప్రాయ సేకరణ



అభిప్రాయ సేకరణకు హాజరైన మత్స్యకారులు

నెల్లూరు(దర్గామిట్ట): 'దశాబ్దాలుగా సముద్ర తీర ప్రాంతాల్లో చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నాం. మా హక్కులకు భంగం కలిగించకుండా కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌ను అమలు చేయాలి' అని మత్స్యకారులు అధికారులను కోరారు. మంగళవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కోస్టల్ మేనేజ్‌మెంట్ ప్లాన్ ఖరారుపై జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాజశేఖర్ ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బోగోలు, విడవలూరు, మైపాడు, ఇందుకూరుపేట, ముత్తుకూరు తదితర మండలాల్లోని తీర ప్రాంత గ్రామాల నుంచి పలువురు మత్స్యకారులు, వివిధ సంఘాల నేతలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతంలో సంప్రదాయ జీవన విధానానికి ఇబ్బందుల్లేకుండాకుండా చూడాలన్నారు. సీఆర్‌జెడ్ ఖరారులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ ప్రజాభిప్రాయ సదస్సులను తీర ప్రాంత గ్రామాల్లో నిర్వహిస్తే ఎక్కువ మంది మత్స్యకారులు హాజరయ్యే అవకాశం ఉందని సూచించారు. కడలూరుకు చెందిన తమిళ జాలర్లు వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని, వారు మత్స్యసంపదను దోచుకెళ్తూ దాడులు చేస్తున్నారని, రక్షణ కల్పించాలని కోరారు. బకింగ్‌హామ్ కెనాల్ పూడికతీత పనులు చేపట్టాలన్నారు. ఎస్టీలకు గుర్తింపు కార్డులు అందజేసి మత్స్యశాఖ ద్వారా సంక్షేమ పథకాలు అందించాలన్నారు. సముద్ర తీరంలో ఉన్న మడ అడవులను కాపాడాలని, ఎటువంటి హాని కలిగించకుండా చూడాలన్నారు. మైపాడ్ బీచ్‌ను అభివృద్ధి చేసి, అన్ని వసతులు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో మత్స్యకారుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం రాయితీతో అత్యాధునిక బోట్లను చేపల వేటకు అందజేస్తున్నట్లు చెప్పారు. తమిళనాడు జాలర్ల అక్రమ ప్రవేశాలపై జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో ఎన్విరాన్‌మెంట్ సీనియర్ ఇంజినీర్ శాస్త్రి, పొల్యూషన్ బోర్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తిపై కత్తితో దాడి

సంగం: వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన మండలంలోని జెండాదిబ్బ గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. జెండాదిబ్బకు చెందిన నాయబ్ రసూల్ అనే వ్యక్తి పెయింటర్. అదే గ్రామానికి చెందిన సర్దార్, మౌలాలి అనే ఇద్దరు ఆటో డ్రైవర్లు. మంగళవారం జెండాదిబ్బలోని ఓ ప్రాంతంలో వీరిద్దరూ ఆటోలో కూర్చొని మద్యం తాగుతున్నారు. ఈ సమయంలో నాయబ్ అక్కడికి వెళ్లాడు. ముగ్గురు మద్యం తాగారు. ఓ విషయమై మాటామాటా పెరగడంతో ముందుగానే కత్తి తెచ్చుకున్న నాయబ్ సర్దార్‌పై దాడి చేయబోగా మౌలాలి ఆపేందుకు ప్రయత్నించాడు. ఆవేశంలో ఉన్న నాయబ్ కత్తితో మౌలాలీని తీవ్రంగా గాయపరిచాడు. బాధితుడిని నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న సంగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

26న సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా జూనియర్ జట్ల ఎంపికలు ఈనెల 26వ తేదీన జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కోటారెడ్డి, సీహెచ్ కామేశ్వరి మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ఎంపికైన వారు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలియజేశారు. ఇతర వివరాలకు 97036 54315, 80742 99640 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా

• రెండు ట్రాక్టర్ల స్వాధీనం



ఇసుక ట్రాక్టర్ల వద్ద పోలీసులు

సోమశిల: మండలంలోని బెడుసుపల్లి రీచ్ నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు అనంతసాగరం ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. బెడుసుపల్లి రీచ్ నుంచి రెండు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పోలీసులు గుర్తించారు. వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేస్తామని ఎస్సై వెల్లడించారు.

పేకాట స్థావరంపై దాడి

• రూ.22,160 నగదు స్వాధీనం

పొదలకూరు: మండలంలోని మొగళ్లూరు గ్రామంలో మంగళవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై డి.రామకృష్ణ కథనం మేరకు.. ఐదుగురు వ్యక్తులు మొగళ్లూరులో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం అందడంతో పోలీసులు దాడులు చేశారు. వారిని అదుపులోకి తీసుకుని రూ.22,160 నగదు స్వాధీనం చేసుకున్నారు.

వినియోగదారుల కోసం హెల్ప్‌డెస్క్‌లు

• ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ విజయన్



వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్‌లో ఎలా చెల్లించాలో వినియోగదారులకు తెలియజేసేందుకు హెల్ప్‌డెస్క్‌లను ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేశారు. నగరంలోని 1, 2 విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో పెట్టిన డెస్క్‌ల్లో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌ల ద్వారా బిల్లులను యాప్‌లో చెల్లించే విధానంపై వివరిస్తున్నామన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్లు కలిగిన వారు ఏపీఎస్పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. నగదును క్రెడిట్, డెబిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్, యూపీఐ, గూగుల్‌పే, ఫోన్‌పే, రూపేకార్డుల ద్వారా చెల్లించవచ్చన్నారు. ఎలాంటి అదనపు రుసుం లేకుండా బిల్లులు చెల్లించడంతోపాటు హిస్టరీలో ప్రతినెలా చెల్లించిన వాటి వివరాలు కూడా తెలుసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, డీఈఈ మధుసూదనరెడ్డి, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు నాగమణి, శ్రీలత, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు శ్రీధర్‌రాజు, సుబ్బయ్య, గోపాలకృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన

• డీఈఓ పీవీజే రామారావు

ఆత్మకూరు: 'ఉపాధ్యాయులు నైపుణ్యాలు పెంచుకోవాలి. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలి. వారు అన్ని సబ్జెక్ట్‌ల్లో అవగాహన కలిగి ఉండేలా కృషి చేయాలి' అని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని ఏపీ గురుకుల పాఠశాలలో ఐదు రోజులుగా జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నాలుగు డివిజన్లలో 553 మంది శిక్షణ పొందుతున్నారన్నారు. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం గురుకుల పాఠశాలను పరిశీలించారు. పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంపై ప్రిన్సిపల్ కామేశ్వరిని అభినందించారు. కార్యక్రమంలో అధికారులు కె.గోపాల్, జి.సుధీర్‌బాబు, ఎం.జ్యోతి, కె.చలపతి, ఎ.సురేష్, టి.నాగేశ్వరరావు, పి.కేశవనారాయణ, కిరణ్‌కుమార్, మస్తానయ్య, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

మా వర్గం మాటే నెగ్గాలంటూ..

• ఫీల్డ్ అసిస్టెంట్ నియామకంలో తమ్ముళ్ల మధ్య విభేదాలు



వాదులాడుకుంటున్న టీడీపీ నాయకులు

సీతారామపురం: మండలంలో తెలుగుదేశం నేతల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్‌ఏ) నియామకం విషయంలో వాగ్వాదానికి దిగారు. ఈ ఘటన మంగళవారం స్థానిక మండల కార్యాలయం ప్రాంగణంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. చిన్నాగంపల్లి పంచాయతీకి సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్ నియామకంలో టీడీపీలోని రెండు వర్గాలు ఆ పార్టీ మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు సమక్షంలోనే తీవ్రస్థాయిలో వాగ్వాదానికి దిగాయి. దీంతో అటు స్థానికులు, ఇటు నాయకులు అవాక్కయ్యారు.

ప్రతి పంచాయతీలోనూ..

ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఎఫ్‌ఏల నియామకంలో కొంతకాలంగా తెలుగు తమ్ముళ్ల మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు నెలకొన్నాయి. ప్రతి పంచాయతీలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఈ వ్యవహారం రోజురోజుకు పెరుగుతుండడంతో ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు ఫీల్డ్ అసిస్టెంట్ల నియామక ప్రక్రియ తలనొప్పిగా మారినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో కొంతకాలంగా మండలంలో ఉపాధి పనులు ప్రారంభానికి నోచుకోలేదు. కూలీలు పనుల కోసం నిరీక్షిస్తున్నారు. ఏఈల నియామకంలో తెలుగు తమ్ముళ్ల మధ్య పొత్తులు కుదరకపోవడంతోనే తమకు పని కరువైందని అనేకమంది పలువురు వాపోతున్నారు.

సైకిల్‌పై ఇంటికెళ్తుండగా..

• బైక్ ఢీకొని వ్యక్తి మృతి



మాల్యాద్రి మృతదేహం

వలేటివారిపాలెం: ఓ వ్యక్తి సైకిల్‌పై వెళ్తుండగా మోటార్‌బైక్ ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. మంగళవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. మండలంలోని పోలినేనిచెరువు గ్రామానికి చెందిన కర్నేటి మాల్యాద్రి (39) సైకిల్‌పై చుండికి వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి ఇంటికి బయలుదేరాడు. చుండి గ్రామానికి చెందిన చెరువుపల్లి లక్ష్మణయ్య అనే యువకుడు తన బైక్‌పై అతి వేగంగా వెళ్తూ ఎంపీపీ స్కూల్ ఎదురుగా మల్యాద్రి సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో మాల్యాద్రి తలకు గాయమై అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్సై బాలమహేందర్‌నాయక్ తెలిపారు. బాధిత తల్లి ఆదెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మాల్యాద్రి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని ఎస్సై తెలిపారు.